# వ్యాస కౌముది



## దశావతారం - ఆర్. శర్మ. దంతుర్తి

**భగవంతుడు,** బ్రహ్మము అనేవి ఎలా ఉంటాయి అనే ప్రశ్నకి రామకృష్ణ పరమహంస ఈ చిన్న కథ చెపుతారు. ముగ్గురు ప్రయాణికులు ఒక దారిలో వెళుతుండగా వాళ్ళు ఒక పెద్ద గోడ పక్కనుంచి పోవడం తటస్థించింది. ముగ్గురికీ ఆ గోడకి అవతల వేపున ఏముందో అనే కుతూహలం ఎక్కువైంది. ఓ నిచ్చెన సంపాదించి తమలో ఒకడిని గోడమీదకి ఎక్కించారు. ఎక్కినవాడు గోడ అంచునుంచి లోపలికి చూసి 'ఆ, ఆ' అని అటువేపు దూకేసాడు. ఇవతల ఉన్న ఇద్దరికీ ఏమీ అర్ధం కాలేదు. అప్పుడు రెండోవాడు గోడపైకి ఎక్కాడు. తీరా ఎక్కాక వాడు కూడా 'ఆ, ఆ' అంటూ అటువేపు దూకేసాడు. మిగిలిన మూడోవాడికి కుతూహలం ఎక్కువైంది. వాడు కూడా గోడమీదకెక్కి 'ఆ, ఆ' అంటూ అటువైపు దూకేసాడు. ఇంతకీ ఆ గోడవతల ఏముంది? చూసినవాళ్ళు అటువేపు దూకేసారు. చూడని వాళ్ళు గోడ ఎక్కితే అటువేపు దూకేస్తున్నారు. బ్రహ్మాన్ని చూసినవాడు కూడా అలాగే ఉంటాడు. బ్రహ్మ పదార్థం దర్శనమైతే అందులో ఐక్యమవడం తప్ప ఇంక చెప్పడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే ఏదైతే మనము వ్యక్తం చెయ్యగలమో అది మన మనస్సు, బుద్ధి, అహంకారాల మీద ఆధారపడి ఉంటుంది. అందువల్లే చూసిన ఒక విషయాన్ని ఒకరు ఓ విధంగా, మరొకరు వేరే విధంగానూ చెపుతారు. బ్రహ్మమనేది అవ్యక్తం. భగవంతుడు అవ్యక్తుడు, అచ్యుతుడు (చ్యుతి అనగా పతనము లేనివాడు) కాబట్టి మన దేహానికి కానీ, కళ్ళకి కానీ కనిపించడు. ఏదైతే మన కళ్ళకి కనిపిస్తోందో అది భగవంతుడు కాదు. అందుకే జ్ఞాన యోగులు 'నేతి, నేతి' (ఇది కాదు, ఇది కాదు) అనే సూత్రాన్ని పాటిస్తారు. అయితే ప్రపంచమంతా అణువణువూ ఉన్నది భగవంతుడే ఈ రెండు సిద్ధాంతాలూ పరస్పర విభిన్నంగా ఉన్నాయి కదా? ప్రతి అణువులోనూ పరమాత్మ దాగి ఉన్నాడు కానీ మనము చూసేది మన దృష్టి మీద ఆధారపడి ఉంటుంది కనకా, మన దృష్టి పరిమితమైంది కనకా అది భగవంతుడు కాదు. అయితే అణువణువులో భగవంతుడు లేడా? అదికాదు దీని అర్ధం. ప్రతి అణువులోనూ ఉన్న భగవంతుడు ఒక్కోచోట ఒక్కో రూపంలో ఉన్నాడు. ఈ రూపాలన్నీ వేరు వేరు కానీ ఈ రూపాల వెనక ఉండే చైతన్యమే ఆ భగవంతుడూ, బ్రహ్మం. ఇదే భిన్నత్వంలో ఏకత్వం అంటే. అయితే ఇక ఇటువంటి ఏకత్వం కనుక్కోవడం ఎలా? మంచి ఆరోగ్యంగా ఉన్న మనిషిలోనూ, శరీరమంతా కుళ్ళిపోయి మృత్యువుకి అతి చేరువలో ఉన్న మనిషిలోనూ ఉన్నది ఆ బ్రహ్మమే అని చూడటానికి మన బాహ్య చక్షువులు చాలవు. ఇలా చూడగలగాలంటే అంతర్దృష్టి అవసరం. ఈ అంతర్దృష్టి కలగాలంటే అహంకార మమకారాలు విడనాడాలి. ఇదెలాగ సాధ్యం? అసలు ఇలాగ భగవంతుడిని చూడటం కుదురుతుందా? కుదురుతుందనే భాగవతమూ, దశావతారాలూ చెప్పేది.

నారము అంటే నీరు. నీటికి ఆధారమైన వాడు కనుక నారాయణుడు అని కూడా పిలుస్తారు విష్ణువుని. ఒకనాడు సనక సనందనాదులు విష్ణువుని దర్శించుకోవడానికి వస్తే ద్వారపాలకులు లోపలికి వెళ్ళకుండా అడ్డగించారు. 'మీకు తెలియదులా ఉంది, మాకు

ఎల్లవేళలా విష్ణువుని చూసే అధికారం ఉంది' అన్నారు ఆ బాలలు. జయవిజయులు 'అయినా సరే ఇప్పుడు విష్ణువుని చూడడం కుదరదు' అనేసరికి వారికి కోపం వచ్చి 'మీరిక్కడ ఉండటానికి తగరు, భూమి మీద జన్మ ఎత్తండి' అని శపించారు. ఈలోపల గుమ్మం దగ్గిర కలకలం విని మహావిష్ణువు అమ్మవారితో బయటికొచ్చాడు. అప్పటికే జరగవలసింది జరిగిపోయి జయవిజయులు మొహాలు వేళ్ళాడేసుకుని నిలబడ్డారు. విష్ణువు బయటకి రాగానే విషయం తెలిసి, "కంగారు పడకండి. ఇది మంచి కోసమే జరిగింది. విశ్వకల్యాణం మీ వల్ల జరుగుతుంది. మీరు మూడు జన్మలు నాకు శత్రువుగా (ద్వేషం) పుట్టినా సరే, పది జన్మలు స్నేహితుడిగా (రాగం) పుట్టినా సరే" అన్నాడు విష్ణువు. "ఈ దేహం కాక మరే దేహమైనా అసహ్యమైన ద్రవాలతో స్రవిస్తూ, రకరకాల వికారాలతో సవాలక్ష మార్పులు చెందుతూ నిరంతరం క్షీణిస్తూ ఉంటుందని విన్నాము. మీ శత్రువుగా అయినా సరే మూడు జన్మలే చాలు" అన్నారు జయవిజయులు. తొందరపడి శాపం ఇచ్చినందుకు సనక సనందనాదులు విచారిస్తుంటే, విష్ణువు 'మీ శాపం లోకకల్యాణం కోసమే' అంటూ వాళ్ళని ఊరడించాడు. 'జగద్రక్షకా, నిన్ను చేరడానికి రాగ ద్వేషాలతో సంబధం లేదని తెలుసుకున్నాము' అని స్తోత్రం చేసి బాలలు వారి నివాసాలకి వెళ్ళారు. అందుచేత రాగద్వేషాలతో నిమిత్తం లేకుండా ఎవరైనా సరే విష్ణు పథం చేరవచ్చు' అని చెప్పేదే భాగవతం. ఆ పరమాత్మని చేరడానికి అనేక మార్గాలున్నాయి.

కామోత్కంఠిత గోపికల్ భయమునన్ కంసుండు వైరక్రియా
సామాగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు భక్తి సేము ఇదె చక్రిం గంటి మెట్టైన ఉ
ద్ధామధ్యాన గరిష్ఠుడైన హరిన్ చెందన్ వచ్చు ధాత్రీశ్వరా

తనని ఎప్పుడు చంపుతాడోనని భయపడుతూ కంసుడూ, కోరికతో పదహారు వేలమంది గోపికలూ, కయ్యానికి కాలుదువ్వే మదమెక్కిన శిశుపాలుడి వంటి రాజులూ, తోటి బంధువులైన వృష్ణులందరూ ఆ మహామహుని గురించి నిరంతరంగా ఆలోచిస్తూ ఉండడం వల్లనే ఆయన్ని పొందగలిగారు. ఇక్కడ ప్రశ్న ఎలాగ ఆయన్ని గుర్తుంచుకున్నాము అనేది కాదు. ఎల్లవేళలా, రాగం తోటికానీ, ద్వేషంతోటి కానీ, ఆయన మనసులో మెదులుతూ ఉండడమే కావాల్సింది. ఒక్కసారిగా వచ్చి కంసుడిని చంపేస్తే పోదా. వాడిని దేవకి ఎనిమిదో గర్భంలో తాను పుట్టేదాకా ప్రతి నిముషమూ చంపడం దేనికి అనే ప్రశ్న రావచ్చు. ఎందుకంటే అది కంసుడి మంచి కోసమే. కంసుడు మొదటిసారి ఆకాశవాణి హెచ్చరించినప్పటినుంచి కృష్ణుడు ధనుర్యాగానికి వచ్చేదాకా అలా ప్రతిక్షణం విష్ణువుని తల్చుకుంటూ చస్తూనే ఉన్నాడు. తన గురించి చింతచేసే వారిని తాను ఎల్లవేళలా కాపాడుతూ ఉంటానని ఆయనే కదా చెప్పాడు.

చలమున బుద్ధిమంతులగు సాధులు, నా హృదయంబులీల దొ
గిలికొనిపోవుచుందు రకిల్బిషభక్తి లతాచయంబులన్
నిలువుగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్
వలలకు జిక్కి భక్త జనవత్సలతంజనుచుందుఁఫదాపసా!

నారము అంటే నీరని, నీటికి ఆధారమైనవాడు నారాయణుడనీ చెప్పుకున్నాం కదా? ఇప్పుడు నీటి ప్రాముఖ్యత చూద్దాం. మోడ్రన్ సైన్స్ కూడా ఇదే చెపుతోంది. అమెరికాలోని నాసాలో ఉన్న స్పేస్ ప్రోగ్రాంలో జరిగే రీసెర్చ్ అంతా నీరు కనుక్కోడానికే ప్రాధాన్యత నిస్తోంది. మొదట చంద్రమండలం మీద దిగిన వాళ్ళు కొన్ని రాళ్ళు తెచ్చారు. అవికాక ఇంకా ఎక్కడెక్కడో రకరకాల గ్రహాలలోంచి, గ్రహకలశాల్లోంచీ, తోక చుక్కల్లోంచీ సంపాదించిన రాళ్ళూ రప్పల మీద రీసెర్చ్ చేసి ఆయా గ్రహాల మీద జీవ సంచారం ఉందా, ఉండేదా, ఉండటానికి ఛాన్స్ ఉందా అనేది చెప్పాలి అంటే ఆ గ్రహంలో ఒకప్పుడు కాని ఇప్పుడు కానీ నీరుంటే, అది వాసయోగ్యమే అని నాసా వారి ఒక ఏకుమేకైన సిద్ధాంతం. అందువల్ల నాసా కూడా ఎప్పుడూ నీటి గురించే వెతుకుతోంది. ఈ మధ్య

మార్స్ రోవర్ అని ఒకదాన్ని మార్స్ మీదకి పంపించారని న్యూస్ పేపర్లో చూస్తున్నాము కూడా. అది కూడా నీటి గురించే వెతుకుతోంది. కన్యాశుల్కంలో అగ్రిహోత్రావధానుల్లా గుడ్డిగా 'ఇవన్నీ మన వేదాల్లో ఉన్నాయి ఛా' అనక్కర్లేదు కానీ, నీటికి ఆధారం, తెలిస్తే అన్నీ తెలిసినట్టే! అందుకే ఎంత పెద్ద చదువులు చదివినా, ఎన్ని గ్రహాలు చూసొచ్చినా, ఆఖరుకి మనందరమూ వెతికేది నీటికి ఆధారమైన ఆయననే. వేల జన్మలు సైంటిఫిక్ రీసెర్చ్‌లో అందనిది హిమాలయాల్లో ముక్కుమూసుకుని కూర్చుని ఆ నారాయణుణ్ణి ధ్యానించే సర్వసంగ పరిత్యాగులకి అందుతుంది. భగవంతుడికి మన గురించి బాగా తెలుసు. ఈ మనుషులు ఎప్పుడూ ఏదో ఒకటి వెతుకుతూ ఆనందం కోసం ప్రాకులాడుతూ ఉంటారు. వాళ్ళకి నేను చాలా దగ్గిరలో ఉంటే నన్ను ఈజీగా తెలుసుకుంటారు అని ఆయన మన హృదయంలోనే తిష్టవేస్తే, ఆ ఒక్క చోటూ తప్ప మనం అనేకానేక గ్రహాలు వెతుకుతున్నాం. మన ముక్కుకన్నా దగ్గిర్లోనే మనకి ఆయన అందుబాటులో ఉన్నాడనే కాదూ మంత్రపుష్పం చెపుతోందీ?

నీలతోయద మధ్యస్థా ద్విదుల్లేఖేవభాస్వరా
నీవార సూక వత్తన్వీ పీతాభాస్వత్యణూపమా
తస్యాశ్శిఖాయా మధ్యా పరమాత్మా వ్యవస్తితః
సబ్రహ్మః సశివః సహరిః స్సేన్ద్ర సోక్షరః పరమస్స్వరాట్

ఆఖరికి మన డాక్టర్లు కూడా ఇదే చెపుతున్నారు. మనిషి వంట్లో దాదాపు డబ్భై నుంచి ఎనభై శాతం నీరే అనీ. నీటికాధారమైనవాడు నారాయణుడే అనుకుంటే, మన హృదయంలో ఉన్నది ఆయనే అన్నది సుస్పష్టం. ఇంకొంచెం ముందుకెళితే మంత్రపుష్పంలో ఇలా చదువుతాం.

యోపాయయతనం వేద ఆయతనవాన్ భవతి
నక్షత్రాణి వా అపామాయతనం వేద ఆయతనవాన్ భవతి
యో నక్షత్రాణా మాయతనం వేద ఆయతనవాన్ భవతి
ఆపోవైనక్షత్రాణామాయతనం ఆయతనావాన్భవై య ఏవం వేద

'ఉదకముల ఉనికిపట్టునెరిగినవాడే ఉనికి గలవాడగుచున్నాడు. ఎవడైతే నక్షత్రములు నారమునకు ఆధారభూతముగా తెలుసుకొనుచున్నాడో వాడు ఆధారము కలవాడగును. అలాగనే నారము, నక్షత్రముల పరస్పరాయతనము నెరిగినవాడే ముక్తిపదము పొందగలడు.' ఆఖరికి హిరణ్యకశిపుడు కూడా తన హృదయంలోనే ఉన్న విష్ణువుని చూడలేక వైకుంఠానికే వెళ్ళాడు. మన హృదయంలోనే కనిపించని దేవుడు మనకు ఇంకెక్కడా కనపడే అవకాశం లేదు కదా? అందుకే అన్నారు ధ్యానం చేసేవాడూ, ధ్యానం చెయ్యబడేదీ కూడా ఆయనే..........

నారాయణ మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణం
నారాయణ పరోజ్యోతిరాత్మా నారాయణః పరః
నారాయణ పరం బ్రహ్మతత్వం నారాయణః పరః
నారాయణ పరోధ్యాత ధ్యానం నారయణః పరః

మంత్ర పుష్పంలో 'అంతర్భహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః' అన్నట్టు చెప్పినదే భాగవతంలోకూడా చెప్పారు కదా? ఎన్నిసార్లు ఎంతమంది చెప్పినా ఒకటే చెప్పేది. ప్రతి పరమాణువులోనూ ఉన్నది ఆయనే.

హరియము విశ్వమంతయు

హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువులేదు వంశపావన వింటే

ఇంక దశావతారాల విషయానికి వస్తే కొంతమంది రామావతారం తర్వాత బలరామవతారం ఆ తర్వాత కృష్ణావతారం అని చెపుతూ ఉంటారు. బుద్ధుడిని తొమిదో అవతారం అంటారు కదా, వీళ్ళు బలరామావతారం అంటారేమిటి? అనే ప్రశ్న ఉదయించడం సామాన్యం. అయితే ఒక్క విషయం గుర్తుంచుకుంటే, ఈ సందేహాలన్నీ పటాపంచలైపోతాయి. విష్ణువనేది ఒక తత్వం. శంఖ చక్రగదాయుధాలూ, లక్ష్మీ ఆయనెక్కడుంటే అక్కడే ఉంటాయి. విష్ణువు లేకుండా వీటిలో ఎవ్వరికీ అస్థిత్వం లేదు. గజేంద్రమోక్షంలో పోతన చెప్పనే చెప్పాడు కదా? ఆయన జారిపోయే ఉత్తరీయం కూడా సవరించుకోకుండా, ఎవరికీ చెప్పకుండా ఏనుగుని రక్షించడానికి పరిగెట్టుకు వెళితే ఏమయ్యింది?

తనవెంటన్సిరి లచ్చి వెంటనవరోధవ్రాతముద్నాని వె
న్కను బక్షీంద్రుడు వాని పొంతను ధనుఃకౌమోదకీ శంఖచ
క్రనికాయంబును నారదుండు ధ్వజనీకాంతుడు రావచ్చిరొ
య్యన వైకుంఠపురంబునం గలుగువారాబాలగోపాలమున్

విష్ణువు రాముడైతే, ఆదిశేషువు లక్ష్మణుడు, శంఖ చక్రాలు భరత శత్రుఘ్నులుగా ఆయనకి సపోర్ట్ స్టేఫ్ గా వచ్చారు కదా? అలాగే బలరాముడు కృష్ణుడికి సపోర్ట్ స్టేఫ్. అంతే కానీ ఆయనిది ఒక అవతారం అవదు. ఆయనిది అవతారమే అని వాదిస్తే అదే లెక్కన లక్ష్మణుడు కూడా అవతారమే ఎందుకంటే రాక్షసుల్ని చంపి రామానుజుడు కూడా దుష్ట శిక్షణ చేసాడు కదా? అలా లెక్క పెడితే రాముడు ఏడో అవతారం, ఎనిమిది లక్ష్మణుడు, తొమ్మిది కృష్ణుడు, పది బలరాముడూ, ఇంక కల్కికి గానీ ఇంకో అవతారానిగ్గానీ అవకాశమే లేదు. భగవంతుడు ఎప్పుడు అవతారం ఎత్తినా అదెంతో విలక్షణీయంగా ఉంటుంది. రాముడిని చూసి పురుషులుకూడా సమ్మోహితులయ్యేవారట. కృష్ణుడిని చూసి సర్వజీవులూ తమను తామే మరిచేవట. బలరాముడి గూర్చి అలా భాగవతంలో ఎక్కడా రాసినట్టు లేదు. రామ రామ రావణ యుద్ధం అయిపోయాక శత్రుఘ్నుడ్ని ఒక చిన్న రాజ్యానికి రాజుగా ఉండమంటే కొన్ని రోజులు పోయాక వెనకి వచ్చేసి 'అన్నా, నిన్ను చూడాలని మనస్సు కొట్టుకు పోతోంది, అక్కడ ఉండలేను' అన్నాడట రాముడితో. ఈ సపోర్ట్ స్టేఫ్ అలాంటివారు.

అయితే వీళ్ళ వాదన ఏమిటంటే బుద్దుడు శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ చేయలేదు అనీ. దేశకాలాలు బట్టి దుష్ట శిక్షణ అనేదానికి అర్థం మారుతూ ఉంటుంది. ఎప్పుడో రాముడు బ్రహ్మాస్త్రం వేసి రావణ సేనల్ని చంపినట్టు దుష్ట శిక్షణ ఈ కాలంలో చేస్తే మనందరం ఊసలు లెక్కపెడుతూ జైల్లో కూర్చోవాలి. ధర్మాన్ని రక్షించడానికి, మనకి ముందుకు దారిచూపడానికి భగవంతుడవతరిస్తుంటాడు. బుద్దుడి కాలంలో అతిగా పెరిగిపోతున్న జీవహింస అరికట్టడానికీ, ఆత్మజ్ఞానమంటే ఏమిటో మర్చిపోయిన ప్రజల్ని ఉద్దరించడానికి, యజ్ఞాల పేరుతో మూగజీవాలకి జరుగుతున్న అన్యాయాలని అరికట్టడానికి ఆయన అవతరించి కొన్ని లక్షలమందికి ఆయన నిర్వానానికి దారి చూపించాడు. ఎవరైనా సరే బుద్దుడికి యాభై మైళ్ళ దూరంలోకి రాగానే ఆటోమేటిగ్గా ఆయన శిష్యులైపోయేవారని చెపుతారు. ఆయన దుష్ట శిక్షణ చేసాడా అంటే, చేసాడు కానీ అవతల మనుషుల్ని చంపి కాదు. అంగుళిమాలుడంతటివాడిని ఆయన ఒక్క రోజులో వానపాములా మార్చేయగలిగాడు. అది దుష్ట శిక్షణ కాదనలేము కదా?

సపోర్ట్ స్టేఫ్ అని చెప్పుకున్నాం ముందు. అయితే మరి బుద్ధావతారంలో ఈ సపోర్ట్ స్టేఫ్ ఎవరంటారు? అని అడగొచ్చు. అన్ని అవతారాలలోనూ సపోర్ట్ స్టేఫ్ కనపడాలని రూలేమీ లేదు. రాముడు పదివేల ఏళ్ళ పైన రాజ్యం చేసాడంటారు. అయితే మత్స్య

కూర్మావతారాలలో ఎక్కడా సపోర్ట్ స్టేఫ్ కనిపించరు. ఇవి చిన్న చిన్న అవతారాలు. చిన్న అంటే కొద్ది ఏళ్ళుకానీ రోజులు కానీ ఉండేవని. అలాగే మనకి ఎనభై ఏళ్ళు - అంటే, బుద్ధ భగవానుడు బ్రతికినంతకాలం - పెద్ద ఏజ్ కాదు రాముడితో చూస్తే. అయినా బుద్ధుడి భార్యా, ఆయన్ని పెంచిన తల్లీ, కంటకి అనే గుర్రం, రాత్రికి రాత్రి రాజ్యం దాటించిన చెన్నుడూ - ఇంకా మనకి తెలియని ఎందరో - వీళ్ళందరూ సపోర్ట్ స్టేఫ్‌కిందే వస్తారు. అదీకాక వీళ్ళందరూ ఒకే టైముకు పుట్టినట్లు చెపుతారు కూడా - అంటే రాముడుతో బాటు ఆయన తమ్ముళ్ళు కూడా పుట్టినట్టు.

ఇంకో విషయం గమనించండి. శత్రువు ఎంత పెద్దవాడైతే అంతమంది సపోర్ట్‌స్టేఫ్ వస్తూ ఉంటారు. పిండి కొద్దీ రొట్టె అన్నట్టుగా. ఒక్క బలి మహారాజుని పాతాళంలోకి తొక్కేయడానికి అందరూ అవసరం లేదు కదా? అయితే రావణ సైన్యాన్ని చంపడం రాముడొక్కడివల్లా అయ్యే పనికాదు. అసలు హనుమంతుడే లేకపోతే రాముడేం చెయ్యగలిగేవాడు? పధ్నాలుగేళ్ళు నిద్రలేకుండా ఉన్నవాడే తనని చంపగలడని ఇంద్రజిత్తుకు బ్రహ్మ చేత వరం ఉంది. అంచేత రాముడు రావణుణ్ణి చంపడం కంటే కూడా లక్ష్మణుడు ఇంద్రజిత్తుని చంపడమే పెద్ద విశేషం అని యుద్ధానంతరం రాముడిని చూడవచ్చిన మునులు అంటారు రాముడితో, ఎందుకంటే వనవాసం మొత్తంలోనూ లక్ష్మణుడు కంటిమీద కునుకు లేకుండా సీతారాముల్ని కాపాడుతూ వచ్చాడు. అలాగే సపోర్ట్ స్టేఫ్ అందరూ వెళ్ళిపోయాక మాత్రమే అవతారం సమాప్తి అవుతుంది. అందుకే ముందు లక్ష్మణుడూ అవతారం చాలిస్తాడు. బుద్ధుడి జీవితంలోకుడా అంతే తనవాళ్ళందరూ నిర్వాణం పొందేదాకా బుద్ధుడు అలా ధర్మచక్రం తిప్పుతూనే ఉన్నాడు. జోక్ గా చెప్పుకోవాలంటే ముందు శేషతల్పం అమరకుండా విష్ణువు వైకుంఠానికి వెళ్ళిపోతే పాలకడలిలో పడుకోవడం మాటటుంచి అక్కడ కూర్చోడానికి కూడా ఏముండదు కదా?

కల్కి అనేది దశావతారం అన్నారు. ఆ అవతారం కల్కి గుర్రాన్నెక్కి వేరే గ్రహాలకి వెళతారట కదా, అది ఎలా సాధ్యమవుతుంది అనే ప్రశ్న అడుగుతూ ఉంటారు. నాసా వారు గ్రహాల మీదకి రకరకాలుగా ఏవేవో పంపిస్తున్నారు. ఇప్పుడింకా ప్రారంభదశలో ఉన్నాం. కల్కి అవతరించేనాటికి ఇంకా డెవలప్ అయ్యి ఇంకా స్పీడుగా వెళ్ళగలమేమో. మనకి నచ్చకపోవచ్చు కానీ ఇందులో గ్లోబల్ వార్మింగ్ ప్రోబ్లం కూడా అంతర్గతంగా దాగి ఉంది, ఎలాగంటే, ఇష్టం వచ్చినట్టు మనం చెత్తా చెదారంతో ఈ భూమండలాన్ని నాశనం చేసుకుంటున్నాం. ఉన్నవాళ్ళు అవతలి వాళ్ళని ఎలా చంపాలా అంటూ రకరకాల ఆయుధాలు తయారు చేస్తున్నారు. ఒకడు ఆటంబాంబ్ అంటే ఇంకోడు ఉన్న విమానంతో బిల్డింగుల్ని గుద్దేసి జనాలని చంపుతున్నాడు. ఇలా వాళ్ళు పెద్ద పెద్ద ఆయుధాలు వాడుతుంటే మనం ప్లాస్టిక్ సంచిలు వాడి, పెట్రోలు వాడి, మనకు చేతనైంది మనం చేసి మన నాశనానికి శక్తికొద్దీ దోహదం చేస్తున్నాం. ఒక్కసారి మూడు వేలమందిని చంపిన బిన్ లాడెన్ చేసే పని ఎంత ఛండాలమైందో, రోజూ క్రమం తప్పకుండా ప్లాస్టిక్ సంచిలు వాడి అవతల పారేసే సామాన్య మానవుడు జీవితంలో చేసే పని అంతే ఛండాలమైంది. ఇలా చేస్తూ పోతే ఏమవుతుంది? ఈ భూమి బతకడానికి పనికి రాదు. అప్పుడు వేరే గ్రహం చూసుకోవాల్సిందే అలా వేరే గ్రహం మీదకి వెళ్ళడానికి అప్పటికి మన రీసెర్చ్ బాగా ముందుకెళ్ళి కల్కికి తోడ్పడవచ్చు. ఓ సారి ఈ భూమి పనికిరాకుండా పోయేసరికి వేరే గ్రహానికి వలస పోవడం తప్పనిసరి అవుతుంది.

ఆకాశంలో ఎగరబోయే కల్కి పక్షి అవ్వొచ్చుకదా? గ్రహాంతరాలకి వెళ్ళాలని రూలేం లేదేమో అంటారా? అయితే అవ్వొచ్చు. కానీ ఒకటి గమనించండి. మత్స్యావతారంనుంచి ఇప్పటివరకూ వచ్చిన అవతారాలు ఒక్కొక్కటీ ఎవల్యూషన్ లో నీటిలోంచిభూమ్మీదకి, శీతల రక్తం నుంచి వేడి రక్తం ఉన్న వాటిగా రూపాంతరం చెందుతున్నాయి. పక్షికి మనకన్నా ఎక్కువ జ్ఞానం లేదని మనకందరికి తెలుసుకదా? ఇంకో విషయం అప్పుడప్పుడు ఫ్లైయింగ్ సాసర్లు కనబడ్డాయనీ, అందులో మనకన్నా ఎక్కువ జ్ఞానం ఉన్న గ్రహాంతరవాసులున్నారనీ అంటూ ఉంటారు. అంచేత ఎగిరే పక్షికన్నా, కావాల్సినప్పుడు ఇతర గ్రహాలకి వెళ్ళగలిగే కల్కి గానే పదో అవతారం రావడానికి అవకాశం ఎక్కువ.

ఆఖరిగా ఇంకో విషయం. భగవంతుడికి ఏ విధమైన రస, రూప గుణాలు లేవు కనుక మనం ఆయన్ని మామూలుగా చూట్టం అసాధ్యం. అయితే మానవాళికి అడుగడుగునా ధర్మ రక్షణ చేస్తూ, దారి చూపిస్తూ భగవంతుడు ఇలాంటి జన్మలెత్తి అష్టకష్టాలు ఎందుకు పడవలసి వస్తోంది? ఆయన మనల్ని మన ఖర్మకొదిలేసి చూస్తూ కూర్చోవచ్చుకదా? ఎందుకంటే భగవంతుడు మనని ఏకోరికా లేకుండా ప్రేమిస్తాడు కాబట్టి. 'అర్జునా ఈ లోకంలో నేను చెయ్యవలసిందేమీ లేదు కానీ నేను కర్మ చేస్తూనే ఉంటాను. ఎందుకంటే నేనే కర్మ చేయకపోతే నన్ననుసరించే వారందరూ అలాగే కర్మ చేయకుండా ఉంటారు' అని ఆయనే చెప్పుకున్నాడు కదా? మనం ఎక్కడ పాడైపోతామో అని ఆయన ఆరాటం. ఇంకో కోణంలోంచి చూస్తే, భర్తృహరి చెప్పినట్టు ఇదంతా కర్మ సిద్ధాంతానికి సంబంధించిన విషయం. ఎందరో రాక్షసుల్ని దాచినందుకు భృగుపత్నిని విష్ణువు చంపితే, భృగువు విష్ణువుని శపిస్తాడు 'నువ్వు కూడా భార్యా విరహం అనుభవించు అని.' ఆ శాపం వల్లే రాముడిగా అవతరించవలసి వచ్చింది. అంచేత దుష్ట శిక్షణలో, ప్రేమించడంలో కూడా కర్మ అనుభవించడం తప్పదు. ఆఖరుకి విష్ణువు కూడా ఈ కర్మానుబంధాలకి అతీతుడు కాదు. ఈ కర్మ ఎంతటి బలీయమైనదంటే...

బ్రహ్మాయేన కులాలవన్నియమితో బ్రహ్మాండ భాండోదరే
విష్ణుర్యేన దశావతారగహనే క్షిప్తో మహాసంకటే
రుద్రోయేన కపాలపాణిపుటకే భిక్షాటనం కారితః
సూర్యోభ్రామ్యతి నిత్యమేవ గగనే తస్మైనమః కర్మణే

"ఏ కర్మ వల్ల బ్రహ్మ పెద్ద కుండలాగ ఉండే ఈ బ్రహ్మాండానికి కట్టుపడి ఉన్నాడో, ఏ కర్మ వల్ల విష్ణువు పది అవతారలు ఎత్తి అష్టకష్టాలు పడవలసివస్తోందో, ఏ కర్మ వలననైతే పరమేశ్వరుడు కపాలంతో భిక్ష ఎత్తవలసి వచ్చిందో, ఏ కర్మ వలన సూర్యుడు ప్రతినిత్యం క్రమం తప్పకుండా ఆకాశంలో తిరగవలసి వస్తుందో అట్టి కర్మకి నమస్కారం."

అయితే ఆ కర్మ వదిలించుకోడానికీ, కర్మ త్యాగానికీ, దేహ రాహిత్యానికీ ఈ మానవ జన్మే ఉత్కృష్టమైంది. నూరు యాగాలు చేసి ఇంద్రుడైనా, చంద్రుడైనా మోక్షం కావలిస్తే మానవ జన్మ ఎత్తి తీరవలసిందే ఇవన్నీ మనకి మన పూర్వులిచ్చిన వెలలేని రత్నాలు. కానీ ముక్కస్యముక్కార్థ చెప్పి 'ఏడీ దేముడు' అనే తర్కానికి అందేది కాదు. పరమేశ్వరుడు కనిపించాలంటే పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి, అహంకారం అన్నీ ఆయనకి అర్పించాల్సి ఉంటుంది. భద్రగజం లాగ, అలాగ చేసిన మరుక్షణంలో 'సిరికిం జెప్పడు శంఖచక్రయుగమున్ చేదోయి సంధింపడే..' అన్నట్టు ఆయనే పరిగెట్టుకుంటూ వస్తాడు మనదగ్గరకి. అలా చేయనంత కాలం పడుతూ లేస్తూ పునరపి జననం పునరపి మరణం. ఆయన్ను అందుకోవడానికి మనమో అడుగు ముందుకేస్తే ఆయన పదడుగులు ముందుకొస్తాడు. కానీ గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, మనమో అడుగు వెనక్కి వేసినప్పుడు ఆయనకూడా పదడుగులు వెనక్కి వెళతాడు

<u>ఇంకొక్క శ్లోకం చెప్పుకుని ముగిద్దాము.</u>

ఆకాశాత్పతితం తోయం యధాగచ్ఛతి సాగరం
సర్వదేవ నమస్కారా కేశవం ప్రతిగచ్ఛతి

"ఆకాశంలోంచి వర్షరూపంలో పడే నీరు ఏ విధంగా చివరికి సాగరజలాల్ని చేరుతోందో, అదేవిధంగా ఏ దేముడికి పెట్టిన నమస్కారమైనా విష్ణువుకే చేరుతుంది."